# గుప్పెడు చీకటి

ఆరోజు యెందుకనోగాని టపారావటం ఆలశ్యమయింది. రోజూ ఈ వేళకు టపా చూచుకుని పొలం వెళ్ళిపోయేవాడు. ఆరోజు యింకా రాలేదు. రైలు లేటయిందేమో?

"సార్" గోవిందు కంఠం వినిపించింది.

"టౌనుకు వెడుతున్నాను సార్. అమ్మగారు సామానులు తీసుకురమ్మన్నారు. పైగా మన ట్రక్కు రేడియేటరు బాగుచేయించాలి. బాగా దుమ్ము పేరుకునిపోయి నీళ్ళు వేడెక్కి పోతున్నాయి. తరచు యింజను ఆగిపోతోంది."

"తొందరగా తిరిగి రండి. గులామ్ కాదరు నిటు రమ్మను,"

గులామ్ కాదర్ రావటమే ట్రేలో టీ తీసుకుని వచ్చాడు.

"టపా వచ్చిందా?" అడిగాడు.

"యింకా రాలేదు సార్. అమ్మగారు తోటకు వెళ్ళి కూరగాయలు కోయించుకుని రమ్మన్నారు"

"తొందరగా వెళ్ళిరా. టపా వస్తే ఆయాను పైకి తీసుకురమ్మను."

టీ కలుపుకుని తాగుతూ వుంటే ఉత్తరాలు తీసుకు వచ్చింది ఆయా, యిచ్చి క్రిందకు వెళ్ళిపోయింది.

కొద్ది క్షణాలలో ట్రక్కు బయలుదేరిన శబ్దం అయింది. టౌను నుండి సిగరెట్లు తీసుకురమ్మని చెబుదామని కిటికి దగ్గరకు వెళ్ళాడు.

బయలు దేరిన ట్రక్కు ఆగింది. చాటుగా వచ్చి ఆయా దాంట్లో ఎక్కింది.

"గోవింద్!" తను బిగ్గరగా పిలిచాడు.

"గుడ్‌బై సార్" గోవిందు ఇటు వంకచూసి నిర్లక్ష్యంగా చెయ్యి వూపుతూ అన్నాడు.

అతనికి ఆశ్చర్యం వేసింది. "యెక్కడికి వెడుతున్నారు వీళ్ళంతా?"

'సుమిత్రా' బిగ్గరగా అరిచాడు సమాధానంగా పాట వినిపించింది.

"సుజనా బరఖా బహార్ ఆయీ" లతామంగేష్కరు పాట - తనకు ఎంతో యిష్టం.

మెట్లు దిగి క్రిందకు వెళ్ళాడు. డైనింగ్ రూమ్‌లోంచి డ్రాయింగు రూమ్‌లోకి నడిచాడు. రేడియో గ్రామ్ దగ్గర సుమిత్ర తన్మయంగా పాట వింటోంది. బేబి బొమ్మతో ఆడుకొంటోంది. మెల్లిగా వెళ్ళి భుజంమీద చెయ్యి వేశాడు. సుమిత్ర వెనక్కి తిరిగి చూడలేదు. అతని చేతిమీద తన వేలిని వుంచింది.

మెల్లగా ఆమె చెవి దగ్గరకు వంగి "మన పాట వచ్చింది చాలా రోజుల తరువాత' ' అన్నాడు.

అరమోడ్పు కన్నులతో సుమిత్ర అన్నది -

"నిజమే చాలా రోజుల తరువాత వచ్చింది"

మేడమీద కూర్చుందువు రా అని అన్నాడు.

సుమిత్ర అతని వంక చూసి చిరునవ్వు నవ్వి, బేబి వంక చూపించింది.

అతను హుషారుగా నవ్వి, కొంటెదానివి అంటూ బుగ్గమీద చిటిక వేశాడు.

"మా అమ్మను ఎందుకు కొట్టావు?" బేబి అడిగింది.

ఇద్దరూ నవ్వుకున్నారు. "అల్లరి చేస్తోంది అందుకని!"

అతని చేయిని పుచ్చుకుని లాగుతూ "ఇక్కడే కూర్చోండి" అన్నది సుమిత్ర.

పాట అయిపోయింది -- ఆలోచన ఆయా మీదకు మళ్ళింది.

"ఆయాను ఎక్కడికి పంపించావు?"

"నేను యెక్కడికీ పంపించలేదే?"

ట్రక్కులో వెళ్ళింది!. "నాకేం తెలియదు"

"అల్లాగా...." అలవాటుగా చెయ్యి జేబుమీదకు వెళ్ళింది,

"సిగరెట్లు తీసుకువస్తాను" అంటూ మేడమీదకు వెళ్ళాడు. బెన్సన్ హెడ్జెస్ సిగరెట్ల పెట్టె అగ్గిపెట్టె బల్లమీద వున్నాయి.

సిగరెట్టు వెలిగిస్తూ వుంటే దృష్టి ఆ ఉత్తరం మీద పడింది. ఆ ఉత్తరం వంక చూసి చిరునవ్వుతో ఒక క్షణం వాసన చూసి

"గుడ్" అంటూ ఉత్తరం చింపి చదవటం మొదలు పెట్టాడు.

ఉత్తరం చదువుతూ వుంటే ముఖం జేవురించింది. వళ్ళంతా చెమట పట్టింది ఆపాదమస్తకం వణికిపోతోంది.

సుమిత్రా! సుమిత్రా! కేకలు పెట్టాడు.

ఆవిడ పైకి వస్తూనే చిడిముడి కోపంతో -- "కనీసం బేబిని నిద్దరపోనివ్వండి"... అంటూ అతని వంక చూసింది. ఆందోళనగా "ఏం జరిగిందండి? అని అడిగింది.

"గన్ క్యాబినెట్ తాళాలు తీసుకునిరా?"

"దేనికి?"

"తరువాత చెబుతా ముందు తీసుకుని రా" -- సీరియస్‌గా ! అన్నాడు.

ఏదో అడుగుదామనుకుని అంతలోనే మనసు, మార్చుకుని, క్రిందకు వెళ్ళి తాళాలు తీసుకుని వచ్చింది.

గన్ క్యాబినెట్ తెరచి చూచి అలాగే నిలబడ్డాడు.

"ఏమిటండి. ఏం జరిగింది?"

అతను ఏం మాట్లాడలేదు. అల్లాగే నిలబడ్డాడు. తనుకూడ దగ్గరకు వచ్చి చూసింది.

"ఖాళీ!" దాంట్లో ఏం లేవు.

"ఏమండి" అని పిలిచింది.

"రివాల్వర్ రైఫిల్ "రెండూ ఎవరో యెత్తుకుపోయారు.

ఎవరు చేశారు యీపని? గులామ్ కాదిర్ ! గోవింద్!

అతనేం మాట్లాడలేదు రెండవ హాల్లో టెలిఫోను దగ్గరకు వెళ్ళి ఒక నెంబరుకు డయల్ చేశాడు....

ఉత్త ఫోనే మిగిలింది,

"సుమిత్రా తీగెలు. ఎవరో కత్తిరించారు !!"

"ఎందుకని?....."

"బేబిని మేడ మీదకు తీసుకురా"

"నన్ను భయపెట్టి చంపకండి. ఏం జరిగిందో చెప్పండి"

"బేబీని తీసుకునిరా!"

ఆవిడతో బాటు తనుకూడ క్రిందకు వచ్చాడు. గ్యారేజిలోకి వెళ్ళాడు.

ట్రాక్టరు ప్రక్కజీపు పెట్టి ఉన్నాయి. జీపు వంక తిరిగి టైర్లు చూశాడు --

నాలుగు టైర్లలో గాలిలేదు. బ్యానెట్ తెరచి చూశాడు. బ్యాటరీ లేదు. పెట్రోలు టాంకు చూశాడు. చుక్క పెట్రోలు లేదు.

ట్రాక్టరు దగ్గరకు వచ్చాడు. వీల్ బోల్టులు అన్నీ తీసేసి వున్నాయి. షెడ్డులో ఎక్కడా ఒక నట్టుగాని బోల్టు గాని లేవు. టూల్స్ ఏమీ లేవు.

భారంగా నిట్టూర్చాడు. అలవాటుగా చెయ్యి గ్యారేజి లైటు స్విచ్ మీదికి పోయింది. స్విచ్ వేసేవుంది. లైటు వెలగటంలేదు.

ఇంట్లోకి వెళ్ళి రేడియో ఆన్‌చేశాడు. లైటు వెలగలేదు. పాటరాలేదు.

రూమ్‌లో లైటు వేశాడు వెలగలేదు.

అనుమానం రూఢి అయింది... నిశ్శబ్దంగా మేడ మీదకు వెళ్ళాడు.

బొమ్మను దగ్గర పెట్టుకుని బేబి సోఫాలో పడుకుని జోలపాట పాడుతోంది.

ఉత్తరాన్ని చేతిలో పుచ్చుకుని సుమిత్ర అనంతంలోకి చూస్తోంది. యితన్ని చూడగానే ఒక్కంగలో వచ్చి అతని కౌగలిలో యిమిడిపోయింది.

"పూర్తిగా చదివావా" అని అడిగాడు.

"చదివాను" అన్నట్లు తలవూపుతూ. ముఖాన్ని అతని గుండెలమీద దాచుకొని వెక్కి వెక్కి ఏడ్చింది.

"ఏం చేద్దామండి? ఇప్పుడు ఎట్లాగండి?"

'యింతకాలం రాక్షసులకు అమృతం పోశాము సుమిత్రా'

"ఇదే ఆఖరి రోజా?"

"కాదు కానివ్వను కూడా' - ఆమెను మెల్లగా సోఫాలో కూర్చో పెట్టాడు. ఆ ఉత్తరం ఆవిడ చేతులోనుంచి తీసుకున్నాడు. కిటికీ దగ్గరకు వెళ్ళి నిలబడ్డాడు. కనుచూపుమేర దూరమంతా అడవి. అంతులేని రకరకాల వృక్షాలు, ఫలాలు, పుష్పాలు రవ్వంత దూరంలో చిన్న చిన్న కొండలు - అందులో ఒక కొండ సగం తవ్వేసి వుంది. చూపు అటునుంచి యిటు తిరిగింది. చక్కటి పొలం పొలాన్ని ఆనుకుని ప్రవహిస్తు అడవిలోకి నూయమైన నదిపాయ, దూరంగా హైటెన్షన్ ఎలక్ట్రిక్ స్థంభాలు.

తళుక్కున ఆలోచన మెరిసింది!! కొండంత ధైర్యం వచ్చింది. చకచకా స్టోరు రూమ్‌లోకి వెళ్ళాడు చిందర వందరగా పడివున్న సామానులు వెదికాడు. కావలసినది లభించింది. 'హమ్మయ్య !' అనుకున్నాడు. ఆ పెట్టెవంక ఒక్కసారి ఆప్యాయంగా చూచుకున్నాడు. దానిమీద రాసిన అక్షరాలను గర్వంగా నిమిరాడు.

'డైనమైట్'

అది తీసుకుని వెళ్ళి యింటి చుట్టుతా అక్కడక్కడక పెట్టి వచ్చాడు.

మేడమీదకు వచ్చాడు.

సుమిత్ర అల్లాగే సోఫాలో  కూర్చుని వుంది, చూడగానే "ఏం చేద్దాం అడిగింది.'

"చావే తప్పని సరైతే తోడుగా ఒకరికి పదిమందిని వెంటబెట్టుకుని వెడదాం"

"ఏం మాటలండి అవి. పదండి ఇక్కడినుంచి వెళ్ళిపోదాం"

"వెళ్ళిపోదామా?'' అలవాటుగా చెయ్యి జేబు మీదకు వెళ్ళింది. సిగరెట్టు ముట్టించుకుని ఆ ఉత్తరం రెండోసారి చదవటం మొదలుపెట్టాడు.

సంఘవిద్రోహి!

కట్టుబట్టలతో పది సంవత్సరాల క్రితం మా దేశం వచ్చావు. మమ్మల్ని అందర్ని నౌకర్లుగా వాడుకున్నావు. ఆస్థులు ఐశ్వర్యాలు సంపాదించుకున్నావు, రంభలాంటి పెళ్ళాన్ని తెచ్చుకున్నావు. పనసపండులాంటి పిల్లని కన్నావు.  పలుకుబడి పెంచుకున్నావు. పెద్ద నాయకుడివి అయిపోయావు. ఎల్లకాలం నీ బూర్జువాతనం చెలాయిస్తుందని అనుకోకు. ప్రజా విప్లవ శక్తి ముందు నువ్వు తలవంచక తప్పదు, నాశనంకాక తప్పదు. నీ లాంటి వాడు నాశనం అయితేనే కాని మిగతా బూర్జువాలు గుణపాఠం నేర్చుకొని అమాయక ప్రజల దగ్గర కొల్లగొట్టిన ధనం తిరిగి ప్రజలకు సజావుగా యివ్వరు. ఈ ఉత్తరం నువ్వు చదువుకునేసరికి బయట ప్రపంచంలో నీకు ఉన్న అన్ని దారులు మూయబడి వుంటాయి. నీ నౌకర్లు నీకు దూరమై వుంటారు. నీ ఆయుధాలు, నీ వస్తు సామాగ్రి నీకు ఉపయోగపడకుండా చెడిపోయి వుంటాయి, నీ యింట్లో నీరు విషపూరితం అయి వుంటాయి, ఎక్కడ చూసినా ఎటుచూసినా మృత్యువు తొంగిచూస్తూ వుంటుంది.

ఈ రాత్రి ప్రజావాణి నీ ఇంటిమీదకు వెల్లువగా రాబోతుంది. పారిపోయే ఆలోచనలు మానుకో. మమ్మల్ని తప్పించుకుని రోడ్డుమీదుగా పారిపోలేవు. అడవి గుండా పారిపోదామని అనుకొంటే మా స్నేహితులు ఎలుగుబంట్లు పెద్ద పులులు అక్కడే వున్నాయి అవి నిన్ను సకుటుంబంగా అర క్షణంలో హరించుకుంటాయి.

రాత్రికి తప్పక కలుసుకుందాం. ఎదురు చూస్తూ వుండు

-ప్రజావాణి

ఉత్తరం మళ్ళీ యింకొకసారి చదువుకున్నాడు.

"సుమిత్రా బయలుదేరు" అని అన్నాడు.

అర్థం కానట్టు అతని వంక చూసింది.

"బేబిని తీసుకుని మనం వెళ్ళిపోతున్నాం."

"ఉత్తరంలో"... అంటూ ఏదోచెప్పబోయింది.

దైవం మీద భారం వేద్దాం. విశ్వాసం లేని మానవులు చేతిలో చావడం కంటే ఆకలిగొన్న అడవి మృగాలకు ఆహుతి కావడం మేలు.

ప్రయత్నం చేస్తామని వాళ్ళు ఊహించరంటావా? ప్రయత్నం... వెలుగు ఉండగానే బయలుదేరితే వాళ్ళకు తెలియదా!

ఐనా మనం ఎందుకు పారిపోవాలి ! ఒక ఆకాశరామన్న ఉత్తరం రాసినంత

మాత్రాన మనం భయపడి పారిపోతే యీ ప్రపంచకంలో ఒక్క క్షణం బ్రతకలేము వీళ్ళని ప్రతిఘటిద్దాం సుమిత్రా !

ఎల్లా? ఆయుధాలు లేవు. అంగబలం లేదు.

"అంగబలం లేకపోవడమేమిటి?'

సింహాల్లాటి రెండు ఆల్సేషన్ కుక్కలు ఉండగా వాళ్ళు మనల్ని ఏం చెయ్యగలరు?

కాని వాళ్ళ దగ్గర తుపాకులు వున్నాయి, మనుష్యులు వున్నారు.

"కుక్కలు ఎక్కడా అలికిడి లేదు, ఎందుకని?"

బహుశః !... అనుమానం పెనుభూతంలాగా వచ్చింది. కొద్దిక్షణాల్లో అది కూడా నివారణ అయింది.

రెండు కుక్కలూ తోటలో పడుకుని వున్నాయి. దీర్ఘనిద్దరలో,

కారణం తెలుసుకోవటం అట్టే కష్టం కాదు. రోజూ మాంసం, పాలు పెట్టె మనుష్యులే యీ రోజున,

విషం పెట్టారు. తమ ప్రాణాలని సైతం లెక్కచేయక ఇంతకాలం కాపాడినందుకు మానవుడు తన కృతజ్ఞతని యీ విధంగా చూపుకున్నాడు.

భగవాన్! వీళ్ళకు నేను చేసిన అపకారం ఏమిటి? ఆకులలములుతిని అడవి జంతువులతో బాటు జంతువులలాగా బ్రతుకుతున్న వీళ్ళని మనుష్యులని చెయ్యటమేనా తను చేసిన పొరబాటు.

ప్రపంచ చరిత్రలో పదిసంవత్సరాలు ఒక లిప్తకాలం కావచ్చు. కాని ఒక వ్యక్తి జీవితంలో పదిసంవత్సరాలు చాలా విలువైన కాలం జీవిత పంథాని మార్చగల కాలం.

నరకంలోంచి స్వర్గాన్ని, స్వర్గంలోంచి నరకాన్ని, సృష్టించగల కాలం.

పది సంవత్సరాలు !

పది సంవత్సరాలు క్రితం - నాగరికత అంటే ఎరుగని అరణ్యం ఇది. స్వర్గంలాగా కనిపించింది ఈ చక్కటి వాతావరణంలో తన శేష జీవితం గడిచిపోతేచాలనిపించింది.

ఆనాడు తోడుగా నిలిచింది. ఇక్కడి సశ్యశ్యామలం ! ఇక్కడి శీతల పవనం ఇక్కడి మనుష్యుల మంచితనం ఈ పరదేశియందు వాళ్లకున్న మమకారం.

కాని తనుచేసిన పొరబాటు ఈ స్వర్గంలో యింతకంటే అందమైన మధురమైన స్వర్గం యింకొకటి సృష్టిద్దామని అనుకోవటం.

పట్టణం నుంచి బుల్‌డోజర్లు వచ్చాయి. ట్రాక్టర్లు వచ్చాయి. ఇంజనీర్లు వచ్చారు. రాజకీయ నాయకులు వచ్చారు. వ్యవసాయ నిపుణులు వచ్చారు.

అడవి అంచున యాభై ఎకరాల సుక్షేత్రమైన మాగాణి ఏర్పడింది. అడవిచెట్ల బదులు పొలం గట్ల మీద కొబ్బరి, మామిడి, నిమ్మలాంటి ఫలవృక్షాలు వచ్చాయి. వ్యర్థమైపోతున్న కొండవాగు నీళ్ళకు ఆనకట్ట వచ్చింది.

సంవత్సరానికి రెండు పంటలు వచ్చాయి.

సూర్య చంద్రుల వెలుగులో కాలం గడిపే వ్యక్తుల మధ్య ఎలక్ట్రిక్ సిటి వచ్చింది.

పక్షులు కిలకిలలకి అడవి మృగాల గాండ్రింపులకి అలవాటు పడ్డ చెవులకి -శవాణి వినిపించడటం మొదలుపెట్టింది.

ప్రకృతి దగ్గర పాఠాలు నేర్చుకునే వ్యక్తులకి పాఠశాలలు వచ్చాయి. పంచాయితీలు వచ్చాయి. రాజ్యాలు రాకపోయిన రాజరికాలు వచ్చాయి.

పుష్పాలకు, పుష్పొడికి అలవాటుపడ్డ ప్రాణులకి కల్లు, దొంగసారా వచ్చాయి.

రాజకీయాలు వచ్చాయి, కక్షలు, వైమనస్యాలు వచ్చాయి.

ఆశలు పెరిగాయి, ఆదర్శాలు దూరమైయ్యాయి, దొరతనం దూరమైపోయింది. దొంగతనం చేరువైంది.

స్నేహం కరువైయింది, ద్వేషం చేరువైయింది. తుఫానులు, దావానలాలు వరదలు, ఎన్నికలు వచ్చాయి.

గొప్ప, బీద, పెద్ద, పిన్న అనే భావనలు వచ్చాయి.

మబ్బులని చూసి వర్షం వస్తుందని సంతోషపడ్డాడు కాని అది పిడుగులని మోసుకుని వస్తుందని గ్రహించలేకపోయాడు!

వాన కురవలేదు. కాని పిడుగులు మాత్రం పడుతున్నాయి.

పది సంవత్సరాల క్రితం తనని యావత్ ప్రపంచం మెచ్చుకుంది.

గ్రామీణ జీవనంలో సృజనాత్మకమైన విప్లవాన్ని తీసుకు వచ్చి ఒక భూతల స్వర్గాన్ని సృష్టించిన వ్యక్తి అని పది సంవత్సరాలుగా తనని పొగిడారు.

సంఘ విద్రోహినని పేద ప్రజానీకం అమాయకత్వంతో ఆడుకుని వారి రక్తంతో పెరిగిన రాక్షసుడని ఈనాడు అంటున్నారు ఎందుకు? ఎందుకు?

ఆనాడు ఉన్నది రామరాజ్యమే ఈనాడు ఉన్నది రామరాజ్యమే.

సూర్యచంద్రులు మారలేదు, భూ ఆకాశాలు మారలేదు, కాని మనిషి మాత్రం ఎందుకు మారిపోయాడు.

ఎందుకని, ఎందుకని?

తనవల్ల ఉపకారాలు, ఎందరు ఎన్ని ఉపకారాలు పొందలేదు.

నాటికి యీనాడు ఏ విలువా లేదు.

తను సంఘ విద్రోహి! వీళ్ళంతా ఉత్తమ పురుషులు!

"వీళ్ళందరిని నాశనం చేస్తాను!" అని బిగ్గరగా అన్నాడు.

"ఎవరిని?" అని సుమిత్ర అడిగింది.

"వీళ్ళనే! మనకు ఉత్తరం రాసిన వాళ్ళని"

మనం ఎవ్వరిని నాశనం చెయ్యవద్దు. చెయ్యాలేము. పదండి

"ఎల్లా!"

"అడవిగుండా పారిపోదాం"

అడవి!! ఎంత తేలికగా అనేసింది.

మనకోసం కాదు మన బేబికోసమన్నా పారిపోవాలి.

"బేబి!" బేబికి ఏం జరగడానికి వీలులేదు తనకున్న సర్వసంపద బేబి ఒక్కర్తే. ధనం పోతే సంపాదించుకోవచ్చు. బేబిని పొగొట్టుకుంటే మాత్రం మళ్ళీ ఎన్నటికీ పొందలేము నిట్టూర్పు వచ్చింది. నిశ్చయం వచ్చింది.

"పద సుమిత్రా వెళ్ళిపోదాం"

ఎటు చూసినా నిశ్శబ్దం, కొండలవెనుకకి సూర్యుడు మళ్ళాడు. అడవిలో చీకటి అంతకంతకు ఎక్కువైంది. ఆయుధం లేకుండా ఏనాడు తను ఇట్లా పట్టపగలు కూడా అడుగు పెట్టలేదు.

కనీసం పదిమైళ్ళు అడవిగుండా నడిస్తేనే కాని పట్టణం రాదు. రెండు మూడు మైళ్ళు నడిస్తేనే గాని పల్లెరాదు. పల్లె జేరుకోవాలి, ఎవరైనా కనికరం ఉన్నవాళ్ళు తనకు నీడ యివ్వవచ్చు.

ఎండిపోయిన కర్ర ఒకటి చేత పుచ్చుకున్నాడు. బేబిని సుమిత్ర ఎత్తుకుంది.

బయలుదేరారు, ప్రాణాలు అరచేత పుచ్చుకుని, ఎండుటాకుల మీద పాదం పడగానే ఫెళఫెళ శబ్దం ! ఈ అలజడికి మూగకన్నుగా నిదురపోతున్న జంతువులలో కలవరం, కోతుల కిచకిచ,

అడుగులో అడుగు వేసుకొంటూ ముందుకు సాగిపోవటం మొదలుపెట్టారు.

ఎటుచూసినా భయంకరం, భీతావహం గంట గడిచేసరికి దూరంలో ఒక మైలు తరిగిందేమో! కాని ఆయువులో మాత్రం యుగాలు తరిగినట్టు అనిపించింది. కొమ్మలు తగిలి ముఖం గీచుకునిపోయింది. ముళ్ళ పొదలు శరీరంలో అణువణువు బాధపెడుతూనే వున్నాయి. ఇవేమి మనస్సుకి తెలియడం లేదు.

ఆలోచన అల్లా ఒకటే ! బేబిని రక్షించాలి, ఇంకా తొమ్మిది మైళ్ళు నడవాలి.

దూరంగా జర జర శబ్దం పక్షుల ఆర్తనాదం, త్రాచుపాము ఎక్కడో పక్షిపిల్లల గూడులోకి దారితీస్తోంది.

వెనకా ముందూ చూడకుండా రెండు లేళ్ళు పారిపోతున్నాయి, తరుముకుంటూ ఎలుగుబంటు పరుగెత్తుతోంది.

బేబి "భయంవేస్తోంది అమ్మా" అని అంది.

సుమిత్ర ఏం మాట్లాడలేదు.

అడుగు ముందుకు వేసింది. చిమ్మచీకటులు దట్టమయ్యాయి.

ఎన్నిమైళ్ళు ఎన్నిగంటలు నడిచారో తెలియదు.

చీకటిని చీల్చుకొని రవ్వంత వెన్నెల చార.

మనస్సు ఒక్కసారి 'అమ్మయ్య' అని అనుకొంది, అంతలోనే భయంతో కంపించి పోయింది.

అది పులివాగు, కొండలో పుట్టిన వాగు చెట్లనీడను ప్రవహించి ఇటునుంచి వెళ్ళి కాలువలో కలుస్తుంది. ఇక్కడ ఎప్పుడూ చల్లగా వుంటుంది. దప్పిక తీర్చుకోవడానికి పులులు ఇక్కడికి వస్తాయి. దప్పిక తీరగానే పచ్చటి గడ్డిలో పడుకొంటాయి.

హంగు, ఆయుధాలు లేకుండా ఇటు ఎవ్వరు రారు, తన దగ్గర యీ ఎండుకర్ర తప్ప ఏం లేదు.

"దాహం వేస్తుంది నాన్నా" అంది బేబి పులివాగు దగ్గరకు వచ్చారు. ఏమీ అలికిడి లేదు.

కాలువలో మంచినీళ్ళు తాగి ముఖం తుడుచుకున్నాడు. ఆకాశంలో చందమామ

వంక జూశాడు. పుచ్చపువ్వులాంటి వెన్నెల.

వెన్నెలలోనుంచి చీకటిలోకి జూశాడు. చెట్టుమీదనుంచి లైటు వెలిగింది.

"సాబ్ !" అంటూ గులామ్ కాదర్ కంఠం వినిపించింది.

ప్రపంచం ఒక్క క్షణం స్థంభించింది.

మనస్సులోంచి ఒక నిట్టూర్పు వచ్చింది.

బేబి !!

పులివాగు అవతల చెట్లచాటునుంచి గులామ్ కాదర్, గోవింద్ యింకా ఎవరో వున్నారు.

అడుగు ముందుకు సాగింది. సుమిత్ర ముందుకు వచ్చి నిలబడ్డాడు.

"నేను సాబ్" మీరు ఇటువస్తారని మాకు తెలుసు అందుకనే ఇక్కడ ఎదురు చూస్తున్నాం.

మీకు అనుకున్నది జరిగిందని సంతోషిస్తున్నారా?"

అప్పుడే ఏమైంది సాబ్ జరగవలసింది అంతా ముందు వుంది.

"దాదా!" అంటూ బేబి పిలిచింది.

కాదిర్ ఏం మాట్లాడలేదు.

సుమిత్రవంక జూసి నెమ్మదిగా బేబిని తీసుకుని పారిపో" అని అన్నాడు.

"మిమ్మల్ని వదిలి వెళ్ళను" అని అంది.

పారిపోవటానికి ప్రయత్నం చెయ్యకండి సాబ్, అన్ని దిక్కులా మా మనుష్యులు వున్నారు.

మీ మనుష్యులు వున్నారా !

"ఉన్నారు"

ఐతే ఇక ఆలస్యం దేనికి కానివ్వండి.

"ఇక్కడ మిమ్మల్ని చంపితే లోకానికి ఎల్లా తెలుస్తుంది సాబ్ మేము అనుకున్న ప్రకారం జరగాలిసిందే."

'సరే పదండి'

నడిచి వెళ్ళనక్కర్లేదు మన ట్రక్కు ఉంది.

(రేడియేటర్? శుభ్రంగా ఉంది. !)

మాట్లాడకుండా ట్రక్కు ఎక్కి కూర్చున్నారు. వెంట చాలామంది మనుష్యులు వున్నారు. అందరి దగ్గరా బాకులు, బరిసెలు వున్నాయి. కొందరి దగ్గర తుపాకులు వున్నాయి.

'ఎవరమ్మా వీళ్ళు' అని బేబి అడిగింది.

సుమిత్ర ఏం మాట్లాడకుండా తనవంక జూసింది.

"మన వాళ్ళేనమ్మా" అని తను అన్నాడు.

వేగంగా వెడుతున్న ట్రక్కు ఒక్కసారి సడన్ బ్రేక్ వేసుకొని ఆగింది.

హెడ్ లైట్స్ వెలుగులో నిర్భయంగా నిలబడింది పులి.

ప్రాణాల మీద తీపి ఉన్న వాళ్ళకు భయం వేసింది. చేతిలో వున్న బరిసెలు, బాకుల విషయం మరచిపోయారు.

తనకు నవ్వు వచ్చింది పెద్ద పెట్టున నవ్వాడు.

"సాబ్!" గులామ్‌కాదర్ కంఠంలో భయం వుంది, హుకూం వుంది.

ఏ రూపంలో వచ్చినా మృత్యువు! మృత్యువే! సాభ్

అలాగే మాట్లాడనులే.

రైఫిల్ మ్రోగింది. గురి తప్పింది. పులి పారిపోయింది.

ట్రక్కు బయలుదేరింది.

"ఇంటికి వెడుతున్నామా అమ్మ?" అని బేబి అడిగింది.

అమ్మ ఏం మాట్లాడలేదు.

ట్రక్కు యింటికి చేరింది. యింట్లో లైట్లు వెలుగుతున్నాయి.

అతను ఆశ్చర్యంగా వాళ్ళ వంక చూశాడు.

"గోవింద్" అంటూ ఏదో చెప్పబోయాడు.

ఇందాక కరెంటు కట్టేసింది మా వాళ్ళే.

ఐ.సీ.

ట్రక్కు యింటిదగ్గర గేటులోపలకి వెడుతూ వుంటే గుండెలు గుబ గుబ లాడాయి.

ట్రక్కు మామూలాగా పోర్టికోలోకి వచ్చి ఆగింది.

అనుమానం వచ్చింది.

సమాధానం కూడా వెంటనే వచ్చింది, డైనమైట్లు తీసేశాం.

మాట్లాడకుండా అతనివంక చూశాడు.

మిమ్మల్ని వెయ్యి కళ్ళతో కనిపెట్టి వున్నాం సాబ్"

"కంగ్రాచ్యులేషన్స్"

ఎందుకు?

"మీ నేర్పుకు ఓర్పుకు"

అందరూ డ్రాయింగు రూమ్‌లోకి వచ్చారు. అక్కడ కూడా జనం వున్నారు. అందరి దగ్గరా ఆయుధాలు వున్నాయి. యిద్దరు చేతుల్లో కాగడాలు వున్నాయి.

హాలు మధ్యలో తను సుమిత్ర బేబి నిలబడి వున్నారు. ఆయుధాలతో చుట్టూతా అంతా నిలబడి వున్నారు. వారి ఆయుధాల కన్నా చూపులు పదునుగా వున్నాయి.

కొందరి ముఖాలు తనకు తెలుసు. కొందరు క్రొత్తవాళ్ళు అందులోంచి ఒక వ్యక్తి తన దగ్గరకు వచ్చాడు.

"తాళాలు ఏవి?" అని అడిగాడు.

కీబోర్డులో వున్నాయి. గోవిందు మీకు చూపిస్తాడు.

గోవిందుని వెంటబెట్టుకుని అతను పైకి వెళ్ళాడు.

గులామ్ కాదిర్ తన దగ్గరకు వచ్చాడు. అతని వెంట మిగతా జనం కూడా

నడిచారు. హాలులోని మూడు స్థంభాలకి తమ ముగ్గురిని తాళ్ళతో కట్టేశారు.

తుపాకులు తనవంక చూస్తున్నాయి.

మనస్సులోకి ఆలోచన ఒకటే - తొందరగా చంపేస్తే బాగుండును.

మేడమీదకు వెళ్ళిన జనం తిరిగి వచ్చారు.

ఇంట్లో వున్న వెండి బంగారాలు రొఖ్ఖం .... దస్తావేజులు బట్టలు మొత్తం తీసుకుని వచ్చారు.

వెండిబంగారాలు డబ్బు ఒక పట్టు చీరెలో మూట కట్టారు. ఖరీదు గల వస్తువులన్నీ ఒకచోట సేకరించారు. కాగితాలన్నీ యింటి ముందర గుట్టగా పోసి కాగడాతో అంటించారు.

ప్రామిసరీనోట్లు ఎక్కడ పెట్టావు?

ప్రామిసరీ నోట్లా?

అవును ఆపదలోవున్న పేద ప్రజలకు వడ్డీలకు వడ్డీ వేయించి రాయించుకున్న ప్రామిసరీ నోట్లు.

నేను ఎవ్వరికి అప్పుగా డబ్బు ఇవ్వలేదు. ఎవ్వరిచేత నోట్లు రాయించుకోలేదు.

'మరి నువ్విచ్చిన అప్పులు...'

ఆపదలోవున్న తోటిమనిషికి సహాయం నేను చేసినపని. అప్పుగా యివ్వలేదే? సహాయం చెయ్యడమే?

అల్లాగా. అంతమంచి వాడవన్నమాట.

"గోవిందు" అంటూ సుమిత్ర పిలిచింది.

"అమ్మా!" అంటూ అతను దగ్గరకు వచ్చాడు.

ఈ ఆస్తి యీ పొలం పుట్రా అన్నీ మీరు తీసుకోండి హాయిగా అనుభవించండి. మమ్మల్ని వదిలిపెట్టేయండి యిక్కడి నించి వెళ్ళిపోతాం. ఎన్నటికి ఈ ప్రాంతానికి రాము.

'ప్రజలకు యీ బూర్జువా దయా ధర్మం అక్కర్లేదు' అని నాయకుడు అన్నాడు.

మీ పాపిష్టి ఆస్తులు తీసుకుని అనుభవించడానికికాదు మేము వచ్చింది మీలాంటి దుర్మార్గుల గుండెల్లో వణుకు పుట్టించడానికి ...

"చూడు గోవింద్ ఈ ఆస్తిని సంపాదించింది నేను, దీనితో సుమిత్రకు కాని బేబికి కాని ఏం సంబంధంలేదు.

మీకేదన్నా కార్పణ్యం కక్ష వుంటే నా మీద తీర్చుకోండి వాళ్ళని మాత్రం వదిలిపెట్టేయండి"

"యెంత త్యాగం" అంటూ ముఠా నాయకుడు వికట అట్టహాసం చేశాడు మూగబొమ్మలలాగా నిలబడతారేం అంటూ గర్జించాడు.

ఒక్కసారి పదితుపాకులు బదులు పలికాయి. ఆశబ్దంలో బేబి ఆర్తనాదం యెవరికి వినిపించలేదు, తను చూచేసరికి రక్తపు మడుగులో తలవాల్చి వుంది.

నూరేళ్ళు పూర్తిగా నిండాయి చిట్టి తల్లికి కట్టిన తాళ్ళు త్రెంచుకుని ఒక్క సారి ఆ చిరంజీవి దగ్గరకు పరుగెత్తాలని శరీరం మనస్సు శాయశక్తులా ప్రయత్నం చేశాయి.

'బేబీ !' అంటూ సుమిత్ర చేసిన ఆక్రందనం అడవి అంతా మారు మ్రోగింది.

'మమ్మల్ని గూడా చంపేయండి, వెంటనే చంపేయండి' అంటూ సుమిత్ర పెద్ద పెట్టున ఏడుస్తోంది, అందరూ ఆమెను చుట్టుముట్టారు, తరువాత జరగబోయేది తలుచుకుంటేనే తనకు నిలువెల్లా మండిపోయింది.

'అబలలని పసికందులని చిత్రహింసలు చేసే మీరు రాక్షసులు, దుర్మార్గులు దేశద్రోహులు పిరికి పందలు నమ్మినవాడిని వెన్నుపోటు పొడిచే ఘాతకులు...." అంటూ తను కేకలు పెడుతున్నాడు.

ఒక బరిసే తన కంఠాన్ని నెమ్మదిగా తాకింది. ఒక రివాల్వర్ తన డొక్కలో గుచ్చుకుంది.

"అరిచి ఏం ప్రయోజనం లేదు. నువ్వు కుక్కలాగా దిక్కుమాలిన చావు చావవలసిందే" తన కళ్ళల్లోకి కళ్ళుపెట్టి చూస్తూ గర్జించింది ఒక కంఠం.

"ఏమండి!" అంటూ సుమిత్ర కంఠం. దుశ్శాసనుడు ద్రౌపది వస్త్రాపరణం మొదలు పెట్టాడు.

"వదలండి నన్ను వదలండి. నా కంఠంలో ప్రాణం వుండగా సుమిత్రను యెవ్వరు ఏం చెయ్యలేరు" అంటూ అతను కేక పెట్టాడు.

యెవరిదో వికట్టాటహాసం.

నగ్నంగా వున్న సుమిత్ర వాళ్ళ చేతుల్లో పెనుగులాడుతూ వ్యర్థప్రయత్నం చేస్తోంది.

తనకళ్ళ యెదుటే తన యిల్లాలి మానం, శీలం సర్వనాశనమై పోతున్నాయి.

అ పాశవిక రాక్షసకాండ ఎంతసేపు జరిగిందో!

దేవతలు దైవం సిగ్గుతో తలవంచుకున్నారు.

పంచభూతాలు స్థంభించాయి. గుండెల్లో అగ్ని పర్వతాలు ప్రేలాయి.

ఈ ఘోరాన్ని అంతా కళ్ళప్పగించి నిశ్శబ్దంగా తను చూస్తున్నాడు.

సావిట్లో నేలమీద రక్తపు మడుగులో సుమిత్ర పడివుంది. కళ్ళు తెరుచుకునే వున్నాయి. కాని ఎవరిని చూడటంలేదు. అందరూ దూరంగా నిలబడి ఆ అభాగ్యురాలివంక నిశ్శబ్దంగా చూస్తున్నారు.

తను "సుమిత్రా" అంటూ పెద్దపెట్టున కేక పెట్టాడు.

సమాధానం ఎవరో చెప్పారు "సాలి మరగయీ ! సాలి మరగయీ!

సుమిత్ర మరణించింది. ఈ నరక యాతన్నుంచి ఈ అవమానం నుంచి విముక్తి పొంది సుమిత్ర మరణించింది.

ఎంత ఆనందం ఎంత సంతోషం.

యెంత ప్రయత్నం చేసినా ఈ ఆనందం ఈ సంతోషం తను అరికట్టలేకపోతున్నాడు.

అంతులేని కన్నీరుగాని, గుండెలు ప్రక్కలు చేసే దుఃఖం కాని ఈ ఆనందాన్ని అరికట్టలేకపోతున్నాయి.

మనస్సులో మెరిసిన మెరుపులు రెండే.

బేబీ మరణించింది.

సుమిత్ర మరణించింది.

తను నవ్వు ఆపుకోలేకపోతున్నాడు. కొండ వాగులాగా తన నవ్వు పెరుగుతోంది. జలపాతంలాగా హోరు పెడుతోంది.

ప్రపంచకమంతా వినిపిస్తోంది. తన నవ్వు బంగారాన్ని పండించే తన పొలాలనుంచి వినిపిస్తోంది. ఆ నవ్వు కొండలు కోనలనుంచి ప్రతిధ్వనిస్తోంది. ఆ నవ్వు పులివాగులో వినిపిస్తోంది. తన నవ్వు పుచ్చపువ్వులాంటి వెన్నెలలో వినిపిస్తోంది తన నవ్వు.

ఎటువిన్నా అంతులేని ఆనందం! అట్టహాసం! ఎటు చూసినా అంతులేని వెలుగు!

యీ అట్టహాసానికి అంతరాయంగా తుపాకుల మోతలు తన రక్తంలోకి చొచ్చుకొని పోతున్న చాకులు బరిసెలు.

అస్పష్టంగా వినిపిస్తున్న ధ్వనులు. అంతులేని ఈ వెలుగుని కప్పివేస్తున్న గుప్పెడు చీకటి - ఎటుచూసినా ఒక్క గుప్పెడు చీకటి !

# 'మరీచిక'

"శ్యామల టీచరుగారికి చాలా సీరియస్‌గా వుంది. మీరు దయచేసి వెంటనే రావాలి"

సరస్వతి

నేను ఆఫీసునుంచి యింటికి వచ్చేసరికి నాకోసం ఎదురుచూస్తున్న టెలిగ్రాము ఇది.

శ్యామల టీచరు ఎవరూ? ఈ సరస్వతి ఎవరూ? ఎక్కడో ఆంధ్రదేశానికి రెండువందల మైళ్ళనుంచి ఈ టెలిగ్రాము నాకు ఎల్లా వచ్చింది?

ఆవిడ ఎవరికో సీరియస్‌గా వుంటె నేను రావటం ఏమిటి? ఈ ప్రశ్నలకు సమాధానం ఎక్కడా దొరకలేదు.

సరాసరి వంట యింట్లోకి వెళ్ళి ఈ టెలిగ్రాము ఎక్కడనుంచి వచ్చిందో నీకు తెలుసా అని మా ఆవిడని అడిగాను. ఆవిడ నా వంక చూడకుండానే.

"తెలియడానికేముంది, వెంటనే బయలుదేరి వెళ్ళండి" అని అంది.

ఈ శ్యామల ఎవరో నీకు తెలుసా?

"మీ స్నేహితురాళ్ళ అందరి పేర్లు నాతో చెబుతున్నారా!" అని ఎదురు ప్రశ్న వచ్చింది.

అక్కడనుంచి మా అమ్మ దగ్గరకు వెళ్ళాను. టెలిగ్రాము చూపించాను. ఎవరమ్మా ఈ శ్యామల?" అని అడిగాను.

"నీ వ్యవహారాలు నా కేం తెలుసు నాయనా" అని ఆవిడ వత్తులు చేసుకుంటూ కూర్చుంది.

అక్కడనుంచి భాష్యం చదువుకుంటున్న మా నాన్నగారి దగ్గరకు వెళ్లి ఆ టెలిగ్రాము చూపించాను.

"ఎవరండీ ఈ శ్యామల మీ కేమన్నా తెలుసా?" అని అడిగాను.